

ఇఫ్తార్ | 6:24
బుధ వారం
సహర్ | 4:56
గురువారం

### రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొడిమ్యాల, మార్చి 12: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాకర్లను మంగళవారం కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని చింతల్లపల్లి వద్ద ఒక్కటి, సండ్రల్లపల్లి వద్ద ఒక్కో ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్లపై
# పెరుగుతున్న ఆశలు

- ఇళ్ల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం
- సొంతింటి కల నెరవేర్చుకోవడంపై లబ్ధిదారుల ఆశలు
- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లపై పేదలు ఆశలు పెంచుకుంటున్నారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సుమారు పదేళ్ల నిరీక్షించిన పేదల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అర్హులు సిద్ధమవుతున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 11వ తేదీన భద్రాచలంలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అర్హులైన పేదలు మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు మార్గదర్శకాలను తెలుసుకుంటున్నారు. కొంత మంది మండల కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రదిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సుమారు పదేళ్ల పాటు నిరీక్షించిన నిరుపేదలు.. ఇందిరమ్మ పథకం ద్వారానైనా సొంతింటి కళను నెరవేర్చుకోవాలని ఆశపడుతున్నారు.

### 2,06,218 దరఖాస్తులు..

జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల తొలి విడతగా మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లోని సుమారు 14 వేల మంది అర్హులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 3,35,781 దరఖాస్తులు రాగా ఇందులో ఎక్కువగా ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోరుతూ 2,06,218 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. సొంత స్థలం ఉన్నవారికి ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. స్థలం లేని నిరుపేద లకు ఇంటి స్థలంతో పాటు ఐదు లక్షల సాయం అందిస్తామని సర్కారు పేర్కొంది. 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కిచెన్, బాత్ రూమ్, ప్రత్యేకంగా ఉండాలి. ఆర్‌సీసీ రూఫ్‌తో ఇంటిని నిర్మించాల్సి ఉంటుంది. లబ్ధిదారుల ఎంపిక అనంతరం జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శి స్తారు. మొదటగా బేస్ మెంట్ స్థాయిలో రూ. లక్ష, పైకప్పు నిర్మాణం జరిగే సమయంలో మరో రూ. లక్ష, పైకప్పు నిర్మాణం పూర్తయిన అనంతరం రెండు లక్షలు మంజూరు చేస్తారని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం మరో లక్ష రూపాయలు అందించి మొత్తంగా రూ. ఐదు లక్షలు లబ్ధిదారుల బ్యాంకుఖాతాల్లో జమ చేస్తారని తెలుస్తోంది.

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేనా?

జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 8,525 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో జగిత్యాల నియోజక వర్గానికి 5,500, ధర్మపురి నియోజకవర్గానికి 1,100, కోరుట్ల నియోజకవర్గానికి 1,400, వేములవాడ నియోజక వర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి మండలాలకు 165, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల మండలాలకు 360 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 5,931 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా జగిత్యాల నియోజకవర్గంలో 4,700, కోరుట్లలో 529, ధర్మపురిలో 130, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో 68, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల మండలాలల్లో 130 డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశ ల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. జిల్లాలో మొదటి విడతలో 375 ఇళ్లు, రెండో విడతలో 5,557 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పుడు మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందా లేదా అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే...
**రాజేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి**



సొంత స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించే విషయంపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వం మార్గదర్శకాలు ఖరారు చేసి ఆదేశిస్తూ అందుకు అనుగుణంగా పథకాన్ని అమలు చేస్తాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన ముందస్తు కసరత్తులు పూర్తి చేశాము.

ఇందిరమ్మ పథకంపై పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు అందాల్సి ఉందని గృహ నిర్మాణ శాఖ అధికారులు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తారా... కొత్తగా మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందా అనే విషయమై కూడా ఇప్పుడే తామేమీ చెప్పలేమంటున్నారు. గతంలో సొంతింటి కోసం వేల సంఖ్యలో పలవురు నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుదారుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు తమ నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను కలిసి విన్నవించుకుంటు

### సొంత స్థలం ఉందా.. బీపీఎల్‌లో ఉన్నారా..

న్నారు. అర్హులైన వారినే ఈ పథకం కింద ఎంపిక చేస్తా మని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధికారులు సైతం ఆచితూచి వ్యవహరించే దోరణితో ఉన్నారు. ఇందిరమ్మ స్కీముకు కూడా కలెక్టర్లే నోడల్ అధికారులుగా ఎంపిక చేసే అవకాశం ఉందంటున్నారు. మండల పరిధిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక అధికారి ఆర్‌ఐల పరిశీలన చేయనున్నా రు. సొంత స్థలం ఉందా... బీపీఎల్ పరిధిలో ఉన్నారా... లేదా... గ్రామంలోని ఓటు హక్కు ఉన్నట్లు గుర్తింపు కార్డు ఉందా... ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది... తదితర వాటిని పరిగణలోకి తీసుకొని ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

### పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి
**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సజావుగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ మంగళవారం పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూనె శ్రీనివాస్, మైలారపు రాంబాబు, నాయకులు దువ్వ రాజు, జిల్లా అవోపా అధ్యక్షుడు పబ్బ శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరావాది లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

### నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా మహేందర్

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షునిగా పెండెం మహేందర్ మంగళవారం ఎన్నికయ్యారు. సంఘ భవనంలో హోరాహోరిగా జరిగిన ఎన్నికల్లో మహేందర్ విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా మర్రిపల్లి గంగరాజం, కార్యదర్శిగా రాచమల్ల శ్రీనివాస్,సహాయ కార్యదర్శిగా మర్రిపల్లి సాగర్, కోశాధికారిగా రాచర్ల శ్రీనివాస్ విజయం సాధించారు. కార్యవర్గాన్ని సంఘ సభ్యులు అభినందించారు.

### దుబ్బ రాజన్న హుండీ ఆదాయం రూ. 29.90 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

సారంగాపూర్, మార్చి 12: మండలంలోని పెంబట్ల కోనాపూర్ దుబ్బ రాజన్న జాతర సందర్భంగా ఆలయ హుండీని మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. హుండీ ద్వారా రూ, 29,90,765 లక్షల ఆదాయం సమకూరింది. వివిద సేవా టికెట్ల ద్వారా రూ 25,557,804 వచ్చాంది. మిశ్రమ బంగారం 17 గ్రాములు, మిశ్రమ వెండీ ఐదు కిలోల 250 గ్రాములు కోడెల ద్వారా ఆదాయం 1,26,000 రూపాయలు వచ్చినట్లు ఆదాయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో అనూష, ఆలయ ఫౌండర్ శంకరయ్య, ఉత్సవకమిటీ సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### జగిత్యాలకు ప్రధాని నరేంద్ర మోదీ రాక
**- 18వ తేదీన బహిరంగ సభ**

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ జిల్లా కేంద్రంలో పర్యటించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభను నిర్వహించడానికి బీజేపీ శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి. ఈనెల 13వ తేదీన జిల్లా కేంద్రంలో బీజేపీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నిర్మల్, మంచిర్యాల, అదిలాబాద్ జిల్లాలకు చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ పర్యటన షెడ్యుల్, ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించడానికి కమలనాథులు సమాయత్తం అవుతున్నారు. బహిరంగసభ స్థలం తదితర వాటిపై దృష్టి సారించనున్నట్లు పైడిపల్లి సత్యనారాయణ తెలిపారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

బీర్‌పూర్, మార్చి 12: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి లచ్చాలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని రైతు వేధిక భవనంలో ఎంపీపీ మసర్తి రమేష్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు తగు సమాచారంతో సమయానికి రావాలని కోరారు.

## అందుబాటులో ఉంటా.. ప్రజాసేవకుడిగా పనిచేస్తా

**- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**
**- నందగిరిలో సింగిల్‌విండో భవనం ప్రారంభం**

పెగడపల్లి, మార్చి 12: నియోజకవర్గ ప్రజలకు నాయకుడిగా కాకుండా ప్రజాసేవకుడిగా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అహర్నిషలు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నందగిరిలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలసి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ప్రారంబించారు. అనంతరం అయిత్‌పల్లి రక్షిత మంచినీటి పథకానికి, మద్దులపల్లి ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులకు, మద్దులపల్లిలో బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నందగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. ఎన్నికల్లో పలుమార్లు ఓడినా నియోజకవర్గ ప్రజల మధ్యన ఉంటూ ప్రజాసమస్యలపై పోరాటం చేశానన్నారు. గత ఎన్నికల్లో మార్పు కోరి తనను ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపించిన ప్రజలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా అందుబాటులో ఉంటానని, పార్టీలకు అతీతంగా నియోజకవర్గ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాబోయే సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సమస్యలు లేకుండా ధాన్యం తూకం వేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సహకార సంఘ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిదిలో తాగు, సాగునీటి విషయంలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా తెలిపారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సహకార సంఘాలకు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా



సింగిల్‌విండో భవనాన్ని ప్రారంభిస్తున్న అడ్లూరి

ఉన్న కాలంలో తిరగి జీవం పోశారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సహకార రంగ వ్యవస్థలో చేపట్టిన మార్పులు పనితీరుతో నేడు తెలంగాణ రాష్ట్రంలోనే గొప్ప పేరు తెచ్చాయన్నారు. సంఘాల ద్వారా కేవలం పంటరుణాలే కాకండా బంగారు ఆభరణాలపై రుణాలు, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘాల ద్వారా మరింత మందికి రుణాలు అందించేలా సహకరించాలని కోరారు. కార్యక్రమాలలో నందగిరి సింగిల్‌విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, సీఈవో రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోళి శోభాసురెందర్‌రెడ్డి, పెగడపల్లి, నంచర్ల సింగిల్‌విండో చైర్మన్లు ఓరుగంటి రమణారావు, మంత్రి వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ గాజుల గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో మహేందర్, సంఘ ఉపాధ్యక్షుడు కిషన్ రెడ్డి, డైరక్టర్లు, సహకార సంఘ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతీఒక్కరు విజ్ఞానవంతులు కావాలి: ఎమ్మెల్యే

కొడిమ్యాల, మార్చి 12: సమాజంలో ప్రతీఒక్కరు చదువుకుని విజ్ఞానవంతులు కావాలని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని తిర్మాలాపూర్‌లో రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచదేశాల్లో భారత రాజ్యాంగం గొప్పదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. భారతదేశంలో అంబేద్కర్ ఒక వర్గానికి సంబంధించిన వ్యక్తి కాదని అంబేద్కర్ అందరి వ్యక్తి అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతీఒక్కరు గౌరవించాలన్నారు. అంబేద్కర్ ఆశయ



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

సాధనకు అందరం పాటుపడాలన్నారు. అనంతరం మండలంలోని శనివారంపేటలో మున్నూరుకాపు సంఘ భవనాన్ని ప్రారంభించారు. హిమ్మతురావుపేటలో జెండాను ఆవిష్కరించారు. తిప్పయ్యపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు ముత్యం శంకర్, అజయ్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమొహన్‌రెడ్డి, రాజు, భూషణ్‌రెడ్డి, మాజీ సర్పంచులు పద్మమల్లేశంయాదవ్, లతమల్లేశం యాదవ్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మామిడి రైతులకు అవగాహన

మల్యాల, మార్చి 12: మామిడి పూత, పిందెలు రాలడంకు తీసుకోవల్సిన నివారణ చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంగారెడ్డి పండ్ల పరిశోధన సాథనం శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర రైతులకు అవగాహన కల్పించారు. మల్యాల రైతు వేధికలో హజరైన రైతులనుద్దేశించి అధిక ఊష్ణోగ్రత-పంటలకు వాటిల్లే నష్టంపై వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ రైతువేధికలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం వివిధ శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణీ, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, ప్రశాంత్ రైతులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి**



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ జ్యోతి

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. రంజాన్ మాసం ఆరంభం దృష్ట్యా జిల్లా కేంద్రంలోని అన్ని మసీదులను చైర్‌పర్సన్ మంగళవారం సందర్శించారు. ఈద్గా మసీదు వద్ద ముస్లింలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మన్సూర్. జుల్‌ఫేకర్, కమాల్, అజహార్, నేహాల్ తదితరులు ఉన్నారు.

**● ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి..**

రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో మంగళవారం పీస్ కమిటీ సమావేశాన్ని డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు తదితరులు ఉన్నారు.

**● ఆలయాల అభివృద్ధికి చర్యలు**

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న సుబ్రహ్మణ్య, లక్ష్మీ గణేష్, అయ్యప్ప ఆలయల్లో చైర్‌పర్సన్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల కమిటీ సభ్యులతో పా టు ఆలయ పూజారులు చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు దేశాయ్, కమటాల శ్రీనివాస్ ఉన్నారు.

## వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలి

**● ఎంపీపీ బాదినేని రాజమణి**



మాట్లడుతున్న ఎంపీపీ బాదినేని రాజమణి

బుగ్గారం మార్చి 12: వేసవికాలం దృష్ట్యా మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు చేసుకోవాలని వివిధ గ్రామాల ప్రత్యేక ఆధికారులకు ఎంపీపీ బాదినేని రాజమణీ సూచించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బాదినేని రాజమణి హాజరయ్యారు. ఈ సంధర్బంగా వివిధ ఆధికారులు పలు సమస్యలపై చర్చించారు. వెల్గొండ, శేకల్ల, గంగాపూర్ గ్రామాల్లో ఎస్సీకాలనీలో నీటి సమస్య ఉందని ప్రత్యేక ఆధికారులు గుర్తించి సమావేశంలో వివరించారు. మద్దునూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నులు, నూతన ఇళ్లు నిర్మించుకునే వారివద్ద పర్మిషన్ కోసం డబ్బులు తీసుకుంటున్నాడు తప్ప ఆన్‌లైన్ రశీదులు ఇవ్వడం లేదని ఎంపీటీసీ గాలిపెల్లి మహేష్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాడు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సేవకేంద్రం ఏర్పాటు చేశామని ఈ కేంద్రంలో ఉచిత విద్యుత్ అమలు కాని వారికి, జీరో బిల్లులు రాని వారికి నమోదు చేసుకోవచ్చని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. అనంతరం జడ్పీటీసీ బాదినేని రాజేందర్ మాట్లాడుతూ రైతులు చనిపోతే ఐదు లక్షల బాండు ఇచ్చే సమయంలో ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఈ యాసంగి పంటలో రైతులకు పొలంలో మోగి పురుగు ఎక్కువ నష్టం చేస్తుందని రైతులకు ఆవగాహన కల్పిస్తు రైతులకు వ్యవసాయ ఆధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీటీసీ గాలిపెల్లి మహేష్, వివిధ శాఖల ఆధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కేసు నమోదు

వీణవంక,మార్చి12: మండల కేంద్రానికి చెందిన నీల సాయి కిరణ్, మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీకి చెందిన మారపాక రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండు నెలలుగా అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధిస్తున్నట్లు రమ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

## బాలిక కిడ్నాప్ : కేసు నమోదు

రామడుగు, మార్చి 12: మండలంలోని గోపాల్‌రావుపేటలో బాలికను కిడ్నాప్ చేసిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమెదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కాలువ నీటి కోసం రైతుల రాస్తారోకో


చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

చొప్పదండి, మార్చి 12: తమ పంటలకు కాలువ నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చేశారు. చొప్పదండి శివారులో డి87 కాలువ వద్ద రాయపట్నం రహదారిపై మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లితో పాటు మండల రైతులు రాస్తారోకో చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నీటిని వారబంధీ పద్ధతిలో అయకట్టుకు అందిస్తున్నారని డి-87 కాలువకు నీటిని వదిలినా చివరి పొలాలకు నీరు అందడం లేదని పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ చివరి పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా చామనపల్లి రైతులతో పాటు కాలువ ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

# గుదిబండగా కరెంటు ఒప్పందాలు

**ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం**

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

### ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా



ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

## ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

తున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పం దించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

# అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.









## మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

## రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

| పోస్టులు | ఖాళీల సంఖ్య | వేతనం (రూ.లలో) |
|---|---|---|
| ప్రొఫెసర్ | 498 | 1,90,000 |
| అసోసియేట్ ప్రొఫెసర్ | 786 | 1,50,000 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 1459 | 1,25,000 |
| సీనియర్ రెసిడెంట్స్ | 1201 | 92,575 |
| ట్యూటర్స్ | 412 | 55,000 |

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

# లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

## 'వాగ్దేవి'లో ఫేర్‌వెల్ హంగామా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మల్యాల, మార్చి 12: మల్యాల మండల కేంద్రంలోని శ్రీవాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నీలం రవి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నతంగా ఎదగాలని అభిలాషించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ పోకల నరేష్‌కుమార్ ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ చైర్మన్‌కు సన్మానం

రాయికల్, మార్చి 12: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లు ఎస్ఎంసీ చైర్మన్‌గా పని చేసిన జక్కుల రాజేంద్రప్రసాద్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రసాద్ దాతల సహకారంతో పాఠశాల భవనానికి రంగులు వేయించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారని పలువురు కొనియాడారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యూవీ రమణి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముత్యంరెడ్డి, రామస్వామి, చిన్నయ్య, శంకరయ్య, మహేష్, గంగాధర్, తిరుమల, కార్తీక్, గంగరాజం, శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

## నాగాలయం హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

రాయికల్, మార్చి 12: మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో మంగళవారం ఉదయం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టగా రూ.2,72,968 ఆదాయం వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ ఈవో విక్రమ్, అర్చకులు రాజేశ్వర శర్మ, ఉత్సవ కమిటీ చైర్మన్ దానవేని రాము, సభ్యులు ఏనుగు నాగరెడ్డి, ముక్కెర ముత్యం, బోదాసు నర్సయ్య, జల, వెంకట్ రెడ్డి, దేవాదాయ శాఖ సిబ్బంది ధనకంటి ప్రవీణ్, కాశిరెడ్డి రాజరెడ్డి, మూటపెల్లి సేవా సమితి, చకినపెల్లి రాజేశం, ఏఎస్సై దేవేందర్, కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ధర్మపురి, మార్చి 12: ధర్మపురి గోదావరి నదీ తీరాన ప్రకృతి వైపరీత్యాలను, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం కోసం ఎన్‌డీఆర్ఎఫ్ దళం ఆధ్వర్యంలో ప్రజలకు మంగళవారం అవగాహన నిర్వహించారు. విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ రాజేందర్ తరోజ్ ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, గుండెపోటు వస్తే సీపీఆర్ చేయడం, వరదలు వస్తే నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కౌన్సిలర్లు జక్కు పద్మ, సంగనభట్ల సంతోషి, తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూపోరాటానికి నాంది పలికిన వీరవనిత చాకలి ఐలమ్మ

మల్లాపూర్, మార్చి 12: భూ పోరాటానికి మొదటగా నాంది పలికిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని మొగిలిపేటలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ జయంతిని బీఆర్ఎస్ హయాంలో అధికారికంగా నిర్వహించామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వేసవిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి 12: వేసవిలో వాతావరణ మార్పులతో వేడి తాపాన్ని తట్టుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి, జగ్గసాగర్ పీహెచ్‌సీ డాక్టర్ అంజిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వెల్లుల్లలోని పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 80 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో బయటకు వెళ్లినప్పుడు ఎండకు తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంచాల సుమలత, శివకుమార్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఆశావర్కర్లు స్వప్న, వసంత, వినయశ్రీ, సుమిత్ర, పద్మపాణి సూపర్‌వైజర్ సుదర్శన్, రాణి, పద్మ, స్రవంతి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, మార్చి 12: మండలంలోని ఎర్రాపూర్ గ్రామానికి చెందిన మాలవత్ అమీలాల్(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మాలవత్ అమీలాల్ తన ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేయగా ఆరు లక్షల అప్పులయ్యాయన్నారు. అప్పుల బాధ భరించలేక ఈ నెల 9న ఇంట్లో లుంగితో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. గమనించిన భార్య నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, మార్చి 12: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా వెల్పూర్ గ్రామానికి చెందిన రాజరపు నరేష్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం నరేష్ ఓ శుభకార్యక్రమానికి వేములకుర్తి వస్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలై మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైకు అదుపు తప్పి ఒకరి మృతి

కథలాపూర్, మార్చి 12: మండల కేంద్రంలో నివసిస్తూ చింతకుంటలో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల రామకృష్ణ (40) అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి మృతి చెందినట్లు ఎస్సై నవీన్ తెలిపారు. చింతకుంటలో సెంట్రింగ్ పనిచేస్తున్న రామకృష్ణ కథలాపూర్‌కు తిరిగి వచ్చే క్రమంలో మార్గ మధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..



సుగుణ (ఫైల్)

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గోవిందపల్లి గ్రా మంలో తీరని విషాదం అలుముకుంది. గ్రామంలో సమీప బంధువు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా అతన్ని చూడడానికి వెళ్లిన వృద్ధురాలు అక్కడికక్కడే గుండెపోటుతో మృతి చెందింది. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. గోవిందపల్లి గ్రామానికి చెందిన గడ్డం హన్మంతరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెం దాడు. విషయం తెలిసిన ఆయన బంధువు అల్లూరి సుగుణ(75) హన్మంత రెడ్డి మృతదేహం పై రోదిస్తూ అక్కడే కుప్పకూలింది. గమనించిన బంధువులు పైకి లేపి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. గుండెపోటు కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్, ఉద్యమకారులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీ ఎన్నికల్లో ప్రజల అండతో ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ దేశాయ్‌తో పాటు 100 మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు.

ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి మాట్లాడారు. పదవీ, హోదా శాశ్వతం కాదని ప్రజా సేవే ప్రధానమన్నారు. జగిత్యాల అభివృద్ధికి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉద్యమకారులు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో పనిచేసినా గుర్తింపు రాకపోవడంతోనే విసిగిపోయి కాంగ్రెస్‌లో చేరామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అండగా ఉంటూ పార్టీని గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, వర్తక సంఘం అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, నాయకులు దుర్గయ్య, అశోక్, అనిత, సుమలత, నర్సయ్య, నేహాల్, కమాల్ తదితరులు ఉన్నారు.

### అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం విశ్వకర్మ నాయకులు జిల్లా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. కుల వృత్తుల పరికరాల కొనుగోలు కోసం ఐదు లక్షల రపాయల రుణాల ను రాయితీపై అందించేలా కృషి చేస్తానన్నారు. రెండు నెలల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మదన్‌మోహన్, వెంకటాచారి, టీపీ సత్యం, సూర్యం, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అంతకుముందు మోతె, తిమ్మాపూర్, జగిత్యాలకు చెందిన గీతా కార్మికులు కాంగ్రెస్‌లో చేరారు, గీతా కార్మికుల హక్కుల రక్షణతో పాటు ఈత చెట్ల పెంపకానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- వేసవిలో మంచి నీటి సమస్యలు ఉండొద్దు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి, 12: పారిశుధ్యం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, శానిటేషన్ సంబంధించిన యాక్షన్ ప్లాన్ చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశించారు. మంగళవారం మెట్‌పల్లి పురపాలక సంఘం సర్వ సభ్య సమావేశం చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎజెండా అంశాలను అయా శాఖల చదివి వినిపించగా పలువురు కౌన్సిలర్లు పారిశుద్యం, మంచినీటి సరఫరా, విద్యుత్, మిషన్ భగీరథ లీకేజీలు, రంజాన్ పండుగ సందర్భంగా మసీదులలో పారిశుధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, పలు సమస్యలను సభ దృష్టికి పలువురు కౌన్సిలర్లు తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అయా శాఖల అధికారులకు ఆదేశించారు. సమావేశంలో పట్టణాభివృద్ధి కోసం చైర్‌పర్సన్ అధ్యతన ప్రవేశపెట్టిన 24 అంశాలను చర్చించి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని పారిశుధ్య నిర్వహణ కోసం శానిటేషన్ అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేసి పనులు చేపట్టాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు ఆదేశించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం, వారు కోరినట్లు లైటింగ్‌లను ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

● అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి..

**కోరుట్ల రూరల్:** అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు ఎజెండా అంశాలను సభ్యుల మందు ఉంచగా పలు సమస్యలను సభ్యులు సభాదృష్టికి తీసుకువచ్చారు. వివిధ సమ్యలపై అధికారులు సభ్యులకు సమాదానం అందించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య - రాజేష్, వైస్ ఎంపీపీ చీటి వెంకటరావు, అధికారులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- 20తులాల వెండి, రూ. 24వేల నగదు అపహరణ

మెట్‌పల్లి, మార్చి 12: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావ్‌పేటలో తాళం వేసి ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి అనుబంధ గ్రామానికి చెందిన తిమ్మని విజయనిర్మల అను మహిళ తన కూతురుతో కలిసి ఉంటుంది. ఈనెల 11న సాయంత్రం ఇంటికి తాళం వేసి ఇబ్రహీంపట్నంలోని బంధువులు వెళ్లారు. తెల్లవారుజామున ఇంటి గేటు తాళం ఉండగా లోపలి తలుపులు తెరిచి ఉండడంతో సమీపంలోని వారు ఫోన్ చేసి విజయనిర్మలకు తెలిపారు.

వెంటనే ఆమె వచ్చి తాళాలు పగలగొట్టి ఉండటంతో పాటు ఇంట్లో బట్టలు, వస్తువులు చిందరవందరగా ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇంట్లోని బీరవాలో దాచుకున్న 20 తులాల వెండి ఆభరణాలు, రెండు గ్రాముల బంగారు కమ్మలు, 24వేల రూపాయల నగదు, ఒక ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. ఇంటి చుట్టు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడానికి ఉంచిన డబ్బులను ఎత్తుకెళ్ళినట్లు బాధితురాలు వాపోయింది. సంఘటన స్థలాన్ని సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి పరిశీలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హామీలను వందశాతం నెరవేరుస్తాం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 12: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బండలింగపూర్, చెర్లకొండపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగిటి అంజయ్య, నాయ కులు, రాజేందర్‌గౌడ్, అంకం శంకర్, అమ్ముల లక్ష్మణ్, చెన్నూరి లక్ష్మి, రామాంజనేయులు, వేణు, తుక్కరాం, రాజకిరణ్, మనోజ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, పవన్, శేఖర్, నగేష్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లి, మార్చి 12: మెట్‌పల్లి డిగ్రీ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో శ్రీనివాస్‌కు ఏబీవీపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పడి పది సంవత్సరాలు కావస్తున్న సమస్యలు పరిష్కారం కాలేదని, వర్షాకాలంలో గ్రౌండ్‌లో నీరు చేరి వెళ్లలేని పరిస్థితి ఉంటుందని, క్లాసు రూమ్‌లకు కిటికీలు లేక గబ్బిలాలు, ఇతర పక్షులు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిగ్రీ కళాశాలను బస్టాండ్ సమీపంలోని జూనియర్ కళాశాలకు మార్చాలని ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి కాసిపాక అరవింద్, కార్యవర్గ సభ్యులు జయంత్, గోపి, పవన్‌కళ్యాణ్, విఘ్నేష్, సాయిరామ్, నాగరాజ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు నాయకులకు సన్మానం

మెట్‌పల్లి రూరల్, మార్చి 12: ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం జైలుకు వెళ్లిన చెరుకు రైతు నాయకులు మామాడి నారాయణరెడ్డి, గోరుమంతుల ప్రవీణ్‌కుమార్‌ను యువ రైతు నాయకులు సన్మానించారు. మంగళవారం మండలంలోని వేంపేటలో రైతు నాయకులను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా యువ రైతు నాయకులు మాట్లాడుతూ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం పోరాటాలు చేసి జైలు వెళ్లిన వారి ఫలితంగానే ఫ్యాక్టరీ తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ జరుగుతుందని చెరుకు రైతులు విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బద్దం మహేష్‌రెడ్డి, తుమ్మల మహేందర్‌రెడ్డి, ఏలేటి మహేష్‌రెడ్డి, అజయ్, గడ్డం శేఖర్ పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

కథలాపూర్, మార్చి 12: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు హంగామా జరిగింది. జ్ఞాపకాలను విద్యార్థులు నెమరువేసుకున్నారు. ఆటాపాటలతో హంగామా చేశారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు నల్ల రాజయ్య, డాక్టర్ అర్జున్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ధర్మపురిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురి, మార్చి 12: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తుల వసతుల ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బ్రహ్మపుష్కరిణి, బ్రాహ్మణ సంఘం, గోదావరి నది, స్నానఘట్టాలు, పరిసర ప్రాంతాలు, రహదారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కోసం హాజరయ్యే భక్తుల సంఖ్య, కల్పించాల్సిన వసతులు గురించి ఆలయ ఈవో, రినోవేషన్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు కలిసి చర్చించారు. అనంతరం క్షేత్రంలో 13 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో స్వామి వారి కల్యాణం, తెప్పె, డోలోత్సవాలు, రథోత్సవం తిలకించే భక్తుల కోసం ఎలాంటి లోపాలు లేకుండా వసతులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. స్వామివారి కల్యాణం సమయంలో శేషప్ప వేదిక ముందు భక్తులు కూర్చొనేలా వసతులు, ఇతరత్రా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలం చదును చేయించి, అన్నదానం నిర్వహించే టీటీడీ ధర్మశాల, బ్రాహ్మణ సంఘం, బ్రహ్మపుష్కరిణి పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. గోదావరినదీ స్నానఘట్టాలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి, భక్తులు తలదాచుకునేలా టెంట్లు, షెడ్లు వేయించి, స్నానాలు కోసం షవర్స్ ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. క్షేత్రంలోని రహదారులను శుభ్రంగా ఉంచి, అంటు వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అన్నారు. ఉత్సవాలు ఆరంభం నుంచి ముగిసే వరకు వివిధ శాఖల పక్షాన చేపట్టాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్, మార్చి 12: రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పారిశుధ్య సమస్యలు, హరితహారం మొక్కల సంరక్షణ, టీయూఎఫ్ఐ డీసీ ద్వారా ప్రారంభించి పనులు పూర్తయ్యేలా చూడాలని, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని పలువురు కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ప్రార్థనా మందిరాల వద్ద లైటింగ్, శానిటేషన్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా 31 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నాక మహేందర్, మారంపెల్లి సాయి కుమార్, తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్ గౌడ్, అన్వరీ బేగం, కల్లెడ సునీత, మ్యాకల అనురాధ, కో ఆప్షన్ సభ్యులు పిప్పోజి మహేందర్, మహ్మద్ మొరాజొద్దీన్, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మేనేజర్ ప్రకాష్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ధర్మపురి, మార్చి 12: మండలంలోని జైనా గ్రామంలో 12 లక్షల రూపాయలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డుకు మంగళవారం ఎంపీటీసీ కుంట రజిత-సుధాకర్ శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కట్ట భూమేష్, కట్ట లక్ష్మణ్, మదుకర్‌రెడ్డి, అల్లె రమేష్, గుమ్ముల చంద్రయ్య, సముద్రాల గంగన్న, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ తరలిన బీజేపీ శ్రేణులు

మెట్‌పల్లి/కోరుట్ల మార్చి, 12: హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా సమావేశానికి మెట్‌పల్లి, కోరుట్ల మండల బూత్ స్థాయిల బీజేపీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విజయ సంకల్పసభకు ముఖ్య అతిథిగా హాజరైన అమిత్ షా సమావేశానికి బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరగా కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. సమావేశానికి వెళ్లినవారిలో పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్, మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, వెంకటాపూర్, యూసుఫ్‌నగర్ మాజీ సర్పంచ్‌లు లింగారెడ్డి, తుక్కారాంగౌడ్, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ పంచరి విజయ్‌కుమార్, నాయకులు ధోనికెల నవీన్, కుడుకల రఘు, బోడ్ల నరేష్, లోలపు అనిల్ తదితరులు ఉన్నారు.

## కదనభేరికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కథలాపూర్/కొడిమ్యాల మార్చి 12: భారత రాష్ట్ర సమితి కరీంనగర్‌లో నిర్వహించిన కదనభేరి సభకు కథలాపూర్, కొడిమ్యాల నుంచి బీఆర్ఎస్ శ్రేణుల తరలివెళ్లారు. బస్సులు, కార్లలో పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించిన నేపథ్యంలో బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

## పోషణ పక్వాడ పక్షోత్సవాలు

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహిళా శిశు అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఆహార పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వాణిశ్రీ, శిశు అభివృద్ధి సంక్షేమ అధికారి నర్సింగారాణి, సెక్టార్ సూపర్‌వైజర్ మమత, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం

కొడిమ్యాల, మార్చి 12: మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా సముద్రాల శ్రీనివాస్‌ను సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ముత్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా సావనపెల్లి శేఖర్, సహాయ కార్యదర్శిగా రాచమల్ల నారాయణ, కోశాధికారిగా రాచమల్ల శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడిగా ఇన్నారపు మల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

భీమారం, మార్చి 12: మండలంలోని వెంకట్రావుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు మంగళవారం ఇడుగునూరి భీమయ్య-నాగమ్మ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు, బూస రాకేష్, నేరెళ్ల శేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు పూడ్చివేతపై గంగపుత్రుల ఆందోళన

మల్యాల, మార్చి 12: మండల కేంద్రంలోని మత్తడి చెరువులో కొందరు మట్టినింపి పూడ్చివేస్తున్నారని గంగపుత్ర సంఘం నాయకులు మంగళవారం చెరువు వద్ద ఆందోళనకు దిగారు. చెరువు ఆధారంగా కొన్నేళ్లుగా 250 వరకు కుటుంబాలు చేపల పెంపకంతో ఆధారపడి ఉన్నారని కొందరు పట్టా భూముల పేరిట మట్టితో పూడ్చివేస్తున్నారని పేర్కొంటూ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం అర్థరాత్రి టిప్పర్ల ద్వారా మట్టి తీసుకువచ్చి చెరువులో పోశారని చెరువు ఎఫ్‌టీఎల్‌ను పూర్తిగా ఆక్రమిస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువు పూడ్చివేయకుండా చూడాలని మట్టి తరలించిన వాహనాలు, చదును చేసిన వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భూమయ్య, రాజయ్య, రవీందర్, రుత్త కిషన్, రాజేశ్, నరేశ్, మనోజ్‌కుమార్, కిరణ్, నరేందర్, నితిన్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, మార్చి 12: పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీదేవి వ్రతాన్ని నిర్వహకులు ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారుతల్లి అమ్మవారికి, శ్యామలదేవి, కాత్యాయనీదేవి, శ్రీవల్లిదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, సంతాన లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. కాత్యాయనీదేవి వత్రం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుష్పార్చనలతో అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని ఐశ్వర్యలక్ష్మి గోశాలను, గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



వ్రతంలో పాల్గొన్న మహిళలు